క్లుప్తంగా

దత్తారంలో తల్లిపాల వారోత్సవాలు



లింగాల: మండలంలోని దత్తారంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలలో భాగంగా అంగన్‌వాడీ విద్యార్థులు, తల్లులు ర్యాలీ నిర్వహించారు. తల్లిపాల ఆవశ్యకత గురించి అంగన్‌వాడీ టీచర్ కళమ్మ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం నస్రీన్ బేగం, పంచాయతీ కార్యదర్శి రాజేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నోట్ బుక్స్ పంపిణీ



ఉప్పునుంతల: మండలంలోని లక్ష్మాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో గ్రామానికి చెందిన శ్రీనివాసాచారి మంగళవారం రూ. 16 వేలు విలువ చేసే నోట్ బుక్స్‌ను విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటయ్య, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, సురేందర్‌రావు, ఉపాధ్యాయులు వెంకటయ్య, బుచ్చయ్య, రాజు, పంచాయతీ కార్యదర్శి నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు ప్రారంభం

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని 99వ సర్వేనంబర్‌లో పేదలకు గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లలో మిగిలిన పనులను మున్సిపల్ కౌన్సిలర్లు, స్థానిక కాంగ్రెస్ నాయకులు మంగళవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే నారాయణరెడ్డి రూ.20 లక్షల నిధులతో పనులు చేపడుతున్నామని వివరించారు. రెండు నెలల్లో పనులు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీను, ఎజాస్, మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం



కొల్లాపూర్ రూరల్: మండలంలోని మొలచింతలపల్లిలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ చిత్రపటానికి దండోరా గ్రామ నాయకులు పాలాభిషేకం చేశారు. 30 ఏళ్ల సుదీర్ఘపోరాటానికి ఫలితం దక్కిందన్నారు. దండోరా నాయకులు పాల్గొన్నారు.

నష్టపరిహారం అందజేత

కల్వకుర్తిరూరల్: మండలంలోని జీడిపల్లి గ్రామానికి చెందిన శివ గత సంవత్సరం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి విద్యుత్ సంస్థ ద్వారా రూ.5 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు మంగళవారం విద్యుత్ ఏడీఈ చంద్రశేఖర్‌రావు బాధిత కుటుంబానికి చెక్కును అందజేశారు. విద్యుత్ ఏఈ శ్రీనునాయక్, భారతీయ కిసాన్ సంఘం జిల్లా అధ్యక్షుడు అంజన్ రెడ్డి, శేఖర్ రెడ్డి, వీరాస్వామి, శ్రీను, మృతుడి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

భూమిపూజపై హర్షం

మన్ననూర్: అచ్చంపేట పట్టణంలో ప్రజా గాయకుడు గద్దర్ విగ్రహ ఏర్పాటుకు మంగళవారం ఎమ్మెల్యే వంశీకృష్ణ భూమి పూజ చేయడంపై కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి సంబు వెంకటరమణ హర్షం వ్యక్తం చేశారు. మూడు దశాబ్దాలపాటు గద్దర్‌కు నల్లమల ప్రాంత ప్రజలతో అనుబంధం ఉందని పేర్కొన్నారు. బస్టాండ్ ప్రాంగణం ఎదుట విగ్రహ ఏర్పాటు చర్యలు తీసుకోవడం సంతోషకరమని వివరించారు.

యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడి ఎన్నిక

ఉప్పునుంతల: యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన మేడమోని భాస్కర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం రాత్రి అచ్చంపేటలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మండల అధ్యక్షుడిగా భాస్కర్‌ను ప్రకటించి అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు కట్టా అనంతరెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రేణయ్య, అసెంబ్లీ కార్యదర్శి శేఖర్‌గౌడ్, యువజన కాంగ్రెస్ నాయకులు మహేష్, శ్రీశైలం, శివ, మధు, నాగిరెడ్డి, జనార్దన్, ప్రదీప్‌రెడ్డి, ప్రహ్లాద్ తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజుల జైలుశిక్ష

వంగూరు: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి కల్వకుర్తి కోర్టు రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు ఎస్ఐ మహేందర్ తెలిపారు. మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన శ్రీశైలం మద్యం తాగి వాహనం నడుపుతున్న శ్రీశైలం క్రాస్‌రోడ్డు వద్ద అతన్ని పట్టుకుని కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు. అతనికి రెండు రోజుల జైలుశిక్ష జడ్జి విధించినట్లు తెలిపారు.

మహనీయులను మరువద్దు

కొల్లాపూర్: మహనీయులను మరువద్దని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో జయశంకర్ 90వ జయంతి, గద్దర్ మొదటి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమ సాధనలో కీలక పాత్ర పోషించిన ప్రొఫెసర్ జయశంకర్, ప్రజా యుద్ధనౌక గద్దర్‌ల బాటలో నడుద్దామన్నారు. వారి ఆశయసాధనకు కృషి చేద్దామన్నారు. పట్టణంలోని ప్రభుత్వ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ మార్క్‌పోలోనియస్, ప్రభుత్వ పీజీ కళాశాలలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎన్.ఉదయ్‌కుమార్, ఎస్టీ కాలేజ్ హాస్టల్‌లో బీఆర్ఎస్‌వీ జిల్లా నాయకులు దారా శేఖర్‌లు జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు.

కొల్లాపూర్ రూరల్: మండలంలోని చింతలపల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్‌రూరల్: తిమ్మాజీపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అనసూయ ప్రొ. జయశంకర్‌కు నివాళి అర్పించారు. స్థానిక పట్టణంలో విద్యార్థి సంఘాలు విశ్వబ్రాహ్మణ సంఘం ఆల్ ఇండియా ప్రొఫెసర్ జయశంకర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.
కార్యక్రమంలో అధ్యాపకులు జయలక్ష్మి, వెంకటయ్య, శోభారాణి, కవిత తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: పట్టణంలోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, వివిధ సంఘాల ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని నిర్వహించారు.



కొల్లాపూర్‌లో నివాళులర్పిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

తెలకపల్లి: మండల కేంద్రంతో పాటు గౌరారంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతిలో మండల ప్రత్యేకాధికారి రాంలాల్, తహసీల్దార్ పాండు పాల్గొన్నారు. ఎంపీడీఓ కృష్ణయ్య, డిప్యూటీ తహసీల్దార్ వెంకటేష్, ఆర్ఐ రామస్వామి, ఎంపీఓ లింగయ్య పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో జయశంకర్ చిత్రపటానికి ఆర్డీఓ శ్రీను నాయక్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ వెంకట్రాములు, ఏపీఓ రాజు తదితరులు పాల్గొన్నారు.

వెల్దండ: ఎంపీడీఓ కార్యాలయంలో, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ప్రొ. జయశంకర్‌కు నివాళులర్పించారు. జెడ్పీ సీఈఓ దేవసహాయం, మండల ప్రత్యేక అధికారి ఖాజానిజామ్ అలీ, ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ గోపాల్ తదితరులు ఉన్నారు.

లింగాల: మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటాని పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ ఆంజనేయులు, డిప్యూటీ తహసీల్దార్ పట్టాభి, జీహెచ్ఎం బషీర్ అహ్మద్, ఉపాధ్యాయులు, ఆయా కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని నిర్వహించారు.

చారకొండ: మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి అధికారులు హాజరయ్యారు.

అమ్రాబాద్: ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ప్రిన్సిపాల్ మదన్‌మోహన్, రాధ, గోపాల్, చంద్రయ్య, జూనియర్ అసిస్టెంట్ రామకృష్ణ పాల్గొన్నారు.



అచ్చంపేటలో..



నాగర్‌కర్నూల్‌లో..



కల్వకుర్తిలో..

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

పెంట్లవెల్లి: విద్యా సమస్యలు పరిష్కారంలో ప్రభుత్వం విఫలం అయ్యిందని కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రెండు రోజులుగా కేజీబీవీలో విద్యార్థులు వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న విద్యార్థులను మంగళవారం పరామర్శించారు. ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఘటనకు సంబంధించిన బాధ్యులపై చర్యలు తీసుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల ఎస్ఓను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజేష్, నరేందర్‌రెడ్డి, పోతుల వెంకటేశ్వర్లు, ఎస్‌కే ఖాజా, యాగోస్, బ్రహ్మం, సురేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

కొల్లాపూర్: మున్సిపల్ బీఆర్ఎస్ నూతన కార్యవర్గాన్ని మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి ప్రకటించారు. మంగళవారం ఆయన పట్టణంలో పార్టీ నాయకులతో ఆయన సమావేశం అయ్యారు. మున్సిపల్ అధ్యక్షుడిగా ఇటుకల సాంబశివుడు యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కట్టా శ్రీనివాస్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా బండి శ్రీను, ఉపాధ్యక్షుడిగా పలక రాముడు, ఎల్ఐసీ పాషా, పుసుపుల రాము, కురువ పరమేష్, రామసుబ్బారెడ్డి, సహాయ కార్యదర్శులుగా మారెడు కుమార్, సుల్తాన్‌పాషా, ఆసిద్ పాషా, బోరెల్లి కురుమయ్య, కోశాధికారిగా హరికృష్ణ, సూర్యలను నియమించారు. అదేవిధంగా సోషల్‌మీడియా ఇన్‌చార్జ్‌లుగా దేవని కుమార్‌మాదిగ, కలర్ మహేష్, సలహాదారులుగా సాకలి నర్సింహ్మ, ఎండీ.జాఫర్, పసుపుల కృష్ణ, కృష్ణమూర్తి, బడా రమేష్‌యాదవ్, పాడేండ్ల సత్యంయాదవ్, కార్యవర్గ సభ్యులుగా కలమంద శేఖర్, కే.ప్రవీణ్, తుపాకుల వెంకటేష్, లింగస్వామి, సాయిరాంసింగ్, రమనమోని విశ్వనాథ్, మరాఠి చక్రి, బల్కా వెంకటస్వామిగౌడ్‌లను నియమిస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు వారికి నియామకపు పత్రాలు అందజేశారు.



విద్యార్థులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి

దర్జాగా రేషన్ బియ్యం తరలింపు



చారకొండ: ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకుంటున్నా అక్రమంగా రేషన్ బియ్యం తరలింపు మాత్రం ఆగడం లేదు. కొన్ని చోట్ల అక్రమార్కులు బహిరంగంగా రేషన్‌బియ్యాన్ని తరలిస్తున్నారు. మంగళవారం గోకారం గేట్ నుంచి గోకారం గ్రామం వెళ్లే మధ్యలో బొలేరో వాహనంలో రేషన్‌బియ్యాన్ని లోడ్ చేస్తున్నారు. అధికారుల అండదండతోనే అక్రమంగా రేషన్‌బియ్యం తరలిస్తున్నారని స్థానికుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బ్యాంకుల్లో బారులు తీరిన రైతులు



కల్వకుర్తి టౌన్: ప్రభుత్వం రుణమాఫీ చేయటంతో బ్యాంకుల ఎదుట రైతులు బారులు తీరారు. మంగళవారం పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంకు వద్ద రైతులు రుణమాఫీకి సంబంధించిన డబ్బులు తీసుకునేందుకు బ్యాంకు తెరవక ముందే క్యూ లైన్లలో నిల్చున్నారు. ఒక్కసారిగా బ్యాంకుకు అధిక సంఖ్యలో రైతులు రావటంతో సిబ్బంది వారిని కంట్రోల్ చేసేందుకు ఇబ్బంది పడ్డారు. రెండోవిడత రుణమాఫీ ప్రారంభించిన నేపథ్యంలో బ్యాంకులో ఆడిట్ కారణంగా డబ్బులు ఇవ్వటం ఆలస్యం అయ్యింది. రైతులందరికి బ్యాంకు సిబ్బంది టోకెన్లను ఇచ్చి వారిని బ్యాంకులోకి అనుమతించి, ఒక్కొక్కరికి డబ్బులు ఇచ్చారు. టోకెన్లను ఇవ్వటంలో బ్యాంకు సిబ్బందికి, రైతులకు కొంత వాగ్వాదం చోటుచేసుకొంది. సాయంత్రం వరకు రైతులతో కిటకిటలాడింది.

గద్దర్‌కు ఘన నివాళి



అచ్చంపేట రూరల్: అచ్చంపేటలో గద్దర్ వర్ధంతిని పలు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హాజరై గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అంతకుముందు పట్టణంలో గద్దర్ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేసి మాట్లాడారు.

వెల్దండ: మండల కేంద్రంలో మంగళవారం ప్రజాకవి గద్దర్ వర్ధంతి సందర్భంగా ఆయా పార్టీల నాయకులు ఘన నివాళి అర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. నాయకులు శేఖర్, వెంకటయ్యగౌడ్, మోతీలాల్‌నాయక్, పుల్లయ్య, క్రాంతి, నారాయణ, నర్సింహా, యాదగిరి, అశోక్ తదితరులు ఉన్నారు.

ఆధునిక వ్యవసాయంపై అవగాహన



తాడూరు: ఆధునిక వ్యవసాయంపై రైతులకు అవగాహన కలిగి ఉండాలని ఏడీఆర్ మల్లారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని శిర్సవాడ, ఇంద్రకల్ గ్రామాల్లోని రైతు వేదికల్లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. చిరుధాన్యాల సాగుపై అధికారుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. జొన్నసాగుపై అవగాహన పెంపొందించేందుకు ప్రతి రైతుకు 3 కిలోల జొన్నల బ్యాగులు అందించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శశిభూషణ్, మహేశ్వరమ్మ, విజయలక్ష్మి, శంకర్, ఏఓ సాయిరమేష్‌కుమార్, ఏఈఓ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భూసమస్య పరిష్కరించాలని వినతి

అమ్రాబాద్: మండల కేంద్రంలోని కోదండరామాలయం, ముస్లింలకు సంబంధించిన కబ్రస్థలానికి భూ సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేయాలని హిందు సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యుటీ తహసీల్దార్ రావూఫ్‌కు వినతి పత్రం అందజేశారు. కోదండ రామాలయానికి సంబంధించిన భూమిని ఆక్రమిస్తున్నారని వివరించారు. వెంటనే సర్వే చేయాలని లేనపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఆలయ ధర్మకర్త శ్రీనివాసులు, పోలసత్యనారాయణ, శ్రీకాంత్, శ్రీనివాసులు, శ్రీను తదితరులు ఉన్నారు.

మిషన్ భగీరథలో ఒండ్రు నీరు సరఫరా



పెద్దకొత్తపల్లి: పట్టణంలో రెండు రోజుల నుంచి మిషన్ భగీరథ తాగునీటిలో ఒండ్రు రావడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కృష్ణానదికి వరదలు పోటెత్తడంతో నీరు ఒండ్రుగా వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటిని మిషన్ భగీరథ అధికారులు ఫిల్టర్ చేయకుండా వదలడంతో నీరు వృథాగా పోతోందని ఆరోపించారు. అధికారులు స్పందించి సమస్య వెంటనే పరిష్కరించాలని కోరారు.

అంగన్‌వాడీ టీచర్‌పై వేధింపులు ఆపాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: అంగన్‌వాడీ టీచర్లపై కాంగ్రెస్ నాయకుల వేధింపులు ఆపాలని బీఎస్పీ నాయకుడు పృథ్వీరాజ్ డిమాండ్ చేశారు. ఉప్పునుంతల మండలం లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ శారద కాంగ్రెస్ పార్టీ నాయకుల వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈమేరకు మంగళవారం అంగన్‌వాడీ టీచర్‌ను బీఎస్పీ నాయకులు పరామర్శించారు. అనంతరం పృథ్వీరాజ్ మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్ కుటుంబ సభ్యులు పార్టీ మారలేదనే అక్కసుతో మాజీ సర్పంచ్ కక్షపూరితంగా వ్యవహరించడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఆమె ఉద్యోగం తొలగించేవరకు ఊరుకోనని బెదిరించడం అన్యాయమన్నారు. మాజీ సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా కార్యదర్శి కల్యాణ్, నాయకులు పాల్గొన్నారు.

అర్హులకు డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి



కల్వకుర్తిరూరల్: అర్హులైన పేదలందరికి ప్రభుత్వం డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బాల్‌నర్సింహా కోరారు. మంగళవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో డబుల్‌బెడ్రూం ఇళ్లు నిర్మించి నాలుగు సంవత్సరాలు పూర్తయిందని గతంలో లక్కీడిప్ ద్వారా లబ్ధిదారులకు ఎంపిక చేశారని కాని వారికి తాళాలు ఇవ్వలేదని వాపోయారు. పరశురాములు, శ్రీనివాసులు, జగన్, కాశన్న, రాజు పాల్గొన్నారు.

కొనసాగుతున్న స్వచ్ఛదనం-పచ్చదనం



నాగర్‌కర్నూల్‌లో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా మంగళవారం రెండోరోజు స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమం కొనసాగింది. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రాల్లోని మినీ ట్యాంక్ బండ్ వద్ద ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి మహిళలతో కలిసి మొక్కలు నాటారు. అచ్చంపేట పట్టణాభివృద్ధికి, స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టిసారించామని, అందరి సహకారంతో స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దుదామని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. పట్టణంలోని 14వ వార్డులో స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. వార్డులో తిరిగి ప్రజల ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెల్దండ మండలంలోని మోడల్ హైస్కూల్‌లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మొక్కలు నాటారు. కొల్లాపూర్‌లోని 17వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్యనాగరాజు పర్యటించారు. 5 వవార్డులో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మహిమూదా బేగం ఖాదర్‌పాషా పర్యటిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తెలకపల్లి మండలం చిన్నముద్దునూరు, కార్వంగ, తాళ్లపల్లి, నడిగడ్డ, గౌరారంలో మండల ప్రత్యేకాధికారి రాంలాల్ పాల్గొన్నారు. ఉప్పునుంతల మండలం పెద్దాపూర్‌లో తహసీల్దార్ సునీత హాజరయ్యారు. లింగాల మండలంలోని వల్లభాపూర్, రాంపూర్ గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై ఎంపీడీఓ ఆంజనేయులు అవగాహన కల్పించారు. పెద్దకొత్తపల్లి మండలం జొన్నలబొగుడ గ్రామపంచాయతీ వద్ద ఎంపీడీఓ నాగేందర్ మొక్కలు నాటారు. మున్సిపల్ చైర్మన్ కల్పన, కమిషనర్ నరేశ్ బాబు, అచ్చంపేట మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసులు, కమిషనర్ శ్యాంసుందర్, తెలకపల్లి ఎంపీడీఓ కృష్ణయ్య, పెద్దకొత్తపల్లి ఎంపీడీఓ నాగేందర్, ఎంపీఓ లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.



అచ్చంపేటలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ



వెల్దండలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఎంఎల్‌హెచ్‌పీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: నేషనల్ హెల్త్ మిషన్ స్కీంలో మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ)లు ప్రజానీకానికి వైద్య సేవలు అందిస్తున్నారని వారికి కనీస వేతన చట్టం ప్రకారం జీతాలు ఇవ్వాలని ఎంహెచ్ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ నర్సింహ డిమాండ్ చేశారు. మంగళవారం ఎంఎల్‌హెచ్‌పీల జనరల్‌బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎంఎల్‌హెచ్‌పీలకు కనీస వేతనం రూ.44వేలు ఇవ్వాల్సి ఉండగా, కేవలం రూ.30వేల జీతం మాత్రమే చెల్లిస్తున్నారని ఆరోపించారు. అనంతరం నూతన కమిటీని ఎంపిక చేశారు. గౌరవాధ్యక్షుడిగా మారేడు శివశంకర్, అధ్యక్షుడు సాయికుమార్, కార్యదర్శి కల్పన, ఉపాధ్యక్షుడు వరలక్ష్మీ, శృతి, సభ్యులు, ప్రేమ్‌కల్యాణ్, రాజు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి బైపాస్ పనులు ప్రారంభం



కొల్లాపూర్: పట్టణ సమీపంలో జాతీయ రహదారి బైపాస్ రహదారి నిర్మాణ పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. 167కే జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా కొల్లాపూర్ సమీపంలోని ఇందిరాగాంధీ చౌరస్తా నుంచి సోమశిల రోడ్డు వరకు బైపాస్ రహదారి నిర్మించనున్నారు. చౌటబెట్ల శివారులో భూములు కోల్పోతున్న వారికి అధికారులు పరిహారం చెల్లించారు. దీంతో రహదారి నిర్మాణ పనులకు లైన్‌క్లియర్ అయింది. నేషనల్ హైవే కాంట్రాక్టు కంపెనీ మొదటగా ఇందిరాగాంధీ చౌరస్తా, పెంట్లవెల్లి రోడ్‌లో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టనున్నారు. ఇందిరాగాంధీ చౌరస్తాలో భారీ పిల్లర్ల నిర్మాణ పనులు చేపట్టారు. చౌరస్తా నుంచి ఎక్సైజ్ స్టేషన్ వరకు భూమిని చదును చేసే పనులు నిర్వహిస్తున్నారు. బైపాస్ రహదారి నిర్మాణ పనులు వీలైనంత త్వరగా పూర్తిచేస్తామని కాంట్రాక్టు కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు.

ఆర్థికసాయం అందజేత



వెల్దండ: మండల కేంద్రానికి చెందిన రాము ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఈ మేరకు మంగళవారం సైనిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.15 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, విష్ణుగౌడు, విజయేందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ప్రయాణికుడి బ్యాగు అప్పగింత

పెద్దకొత్తపల్లి: కొల్లాపూర్ నుంచి హైదరాబాద్‌కు మంగళవారం ప్రయాణికుడు పర్వతాలు ఆర్టీసీ బస్సులో బయలుదేరాడు. కొల్లాపూర్ బస్టాండ్‌లో బ్యాగును మర్చిపోయి ఎక్కాడు. ఈ విషయం గుర్తుకువచ్చి పెద్దకొత్తపల్లి బస్టాండ్‌లో దిగి ఆర్టీసీ కంట్రోలర్ నిరంజన్ దృష్టికి తీసుకెళ్లాడు. కంట్రోలర్ స్పందించి బ్యాగ్ వివరాలను కొల్లాపూర్ ఆర్టీసీ సిబ్బందికి వివరించాడు. అక్కడి నుంచి బస్సుద్వారా పెద్దకొత్తపల్లికి బస్సులో పంపించారు. కంట్రోలర్ నిరంజన్ ప్రయణికుడికి బ్యాగ్‌ను అప్పగించారు.

రోడ్డు నియమ నిబంధనలు పాటించాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: రోడ్డు నియమ నిబంధనలు పాటించాలని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం రోడ్డు భద్రత 2024 సంవత్సరం కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డు సేఫ్టీ అధ్యక్షుడు ఎద్దుల వెంకటేష్, ముఖ్య సలహాదారులు కావలి శ్రీను, అడ్వైజర్ కుంభం మల్లేష్‌గౌడ్, జిల్లా సెక్రెటరీ నర్సింహారెడ్డి, జాయింట్ అడ్వైజర్ రాజు, శ్రీకాంత్, జయసూర్య, ఖాజ తదితరులు పాల్గొన్నారు.

తాడూరు: సీఎం రిలీఫ్‌ఫండ్ పేదలకు వరంగా మారిందని ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాలకు సంబంధించి 34 మంది లబ్ధిదారులకు చెక్‌లను అందజేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, మాజీ జెడ్పీటీసీ రోహిణి, ఎంపీడీఓ జ్యోతిపరోసియా, డిప్యూటీ తహసీల్దార్ మహముద్‌అలీ, ఎంపీఓ బ్రహ్మచారి పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్ క్రైం: తల్లి పాలు బిడ్డకు శ్రేయస్కరమని, శిశువు జన్మించిన వెంటనే తల్లిపాలు పట్టించాలని ఎమ్మెల్యే డా.రాజేష్‌రెడ్డి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో బాలింతలకు పండు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జనరల్ ఆస్పత్రిలో బాలింతలకు, గర్భిణులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని అన్నారు. ఎమ్మెల్యే వెంట గైనిక్ హెచ్ఓడీ డా.నీలిమ, ఆర్ఎంఓ అజీం ఉన్నారు.

వసతి గృహాల నిర్వహణపై నిర్లక్ష్యం వహించొద్దు



లింగాల: వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల నిర్వహణపై నిర్లక్ష్యం వహించొద్దని జిల్లా గిరిజన సంక్షేమాధికారి ఫిరంగి అన్నారు. మండలంలోని లింగాల గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, ఎస్టీ బాలుర వసతి గృహం, మండలంలోని అప్పాయపల్లి, క్యాంపు రాయవరం గిరిజన ఆశ్రమ పాఠశాలలను మంగళవారం డీటీడీఓ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆయా వసతి గృహాల పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కూలడానికి సిద్ధంగా ఎస్టీ బాలుర వసతి గృహం చూసి విస్మయం వ్యక్తం చేశారు. బాలికల ఆశ్రమ పాఠశాల ప్రధాన మార్గంలో ఉన్న మురుగును చూసి హెచ్‌డబ్ల్యూఓపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆశ్రమ పాఠశాలకు ప్రార్థన సమయానికి వెళ్లిన డీటీడీఓ విద్యార్థినుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి వసతి గృహంలో ఫేస్ రీడింగ్ అటెండెన్స్ సిస్టం(ఎఫ్ఆర్ఏఎస్)ను అమలు చేయాలని హెచ్‌డబ్ల్యూఓలను ఆదేశించారు. ఇటీవల అనారోగ్యానికి గురైన విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఎస్టీ బాలుర వసతి గృహానికి నూతన భవన నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలం అవసరమని అన్నారు. డీటీడీఓ వెంట ఏసీఎం తిర్పతయ్య, వార్డెన్లు బాలస్వామి, శ్రీనివాసులు, తిర్పతయ్య, మంగమ్మ ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన బీఎస్ఎఫ్ నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నూతన భవనాన్ని నిర్మించేందుకు నిధులు విడుదల చేయాలని కోరుతూ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డిని మంగళవారం బీఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు రామకృష్ణ కోరారు.

వ్యక్తికి జైలుశిక్ష

కల్వకుర్తి టౌన్: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో వ్యక్తికి జైలుశిక్ష, జరిమానా విధించినట్లుగా ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. రెండు రోజులు కిందట పట్టణంలో నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం మల్లాపూర్‌కు చెందిన రామస్వామి పట్టుబడ్డాడు. అతడిని మంగళవారం కోర్టులో ప్రవేశపెట్టగా జూనియర్ సివిల్ కోర్టు జడ్జి కావ్య రెండు రోజుల జైలుతో పాటుగా, రూ.100 ఫైన్ విధించినట్లుగా ఎస్ఐ తెలిపారు.